## మిర్చి @ 27,200 బస్తాలు

కాశీబుగ్గ, జనవరి 24: వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం రికార్డు స్థాయిలో 27,200 మిర్చి బస్తాలు వచ్చాయి. ఈ సీజన్‌లో డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు ఇదే అత్యధికం. దీంతో మార్కెట్‌లో ఎటు చూసినా మిర్చి బస్తాలే దర్శనమిచ్చాయి. ఈ సీజన్ ప్రారంభం నుంచి రోజుకు రెండు వేల నుంచి 10 వేల వరకు బస్తాలు వచ్చాయి. సంక్రాంతి పండుగ తర్వాత బస్తాల సంఖ్య క్రమంగా పెరుగుతూ వస్తున్నది. ఈ నెల 19న అత్యధికంగా 25 వేలు, సోమవారం, మంగళవారం 20 వేలకు పైగా బస్తాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో అడ్తి, ఖరీదు వ్యాపారులతోపాటు కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు మార్కెట్‌కు లక్షా 13 వేల క్వింటాళ్ల మిర్చి వచ్చినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. తేజ రకం క్వింటాల్‌కు రూ. 20,200, వండర్‌హాట్ రూ. 19 వేలు, యూఎస్ 341 రూ. 16,800, తాలు రకం రూ. 8700 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

### మార్కెట్‌కు మూడు రోజులు సెలవు

ఎనుమాముల మార్కెట్‌కు మూడు రోజులు సెలవు ప్రకటించినట్లు కార్యదర్శి సంగయ్య తెలిపారు. శుక్రవారం గణతంత్ర దినోత్సవం, శనివారం వారాంతపు యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు. 27న సీసీఐ కొనుగోళ్లు యథావిధిగా జరుగుతాయని, 29 నుంచి మార్కెట్‌లో క్రయవిక్రయాలు పునఃప్రారంభం అవుతాయని వెల్లడించారు.

### పరకాల నియోజకవర్గం

- ఆరెపల్లి నుంచి కంఠాత్మకూర్ వరకు రోడ్డు వెడల్పు రూ.20.20 కోట్లు
- ఆరెపల్లి నుంచి కంఠాత్మకూర్ వరకు రోడ్డు వెడల్పు బిట్-2 రూ.12కోట్లు
- ఓగ్లాపూర్ నుంచి ధర్మారం రోడ్ వరకు రోడ్డు వెడల్పు రూ.15కోట్లు
- ధర్మారం నుంచి పులిగిల్ల వయా నడికూడ రూ.5.29కోట్లు, • కామారం నుంచి లక్ష్మీపురం వయా పెంచికలపేట వరకు రూ.4.83కోట్లు
- కటాక్షాపూర్ నుంచి ప్రగతిసింగారం వరకు రూ.3.41కోట్లు
- కాపుల కనపర్తి నుంచి సంగెం రూ.5.29కోట్లు
- కామారం నుంచి లక్ష్మీపూర్ రూ.3.17కోట్లు

మొత్తం రూ.21.99 కోట్లు

### వర్ధన్నపేట

- శ్రీనగర్ నుంచి ఎల్గూర్ రంగంపేట రూ.3.67కోట్లు
- చౌటపల్లి నుంచి చింతనెక్కొండ రూ.3.99 కోట్లు
- పర్వతగిరి నుంచి మేచరాజుపల్లి రూ.5.03కోట్లు
- ధర్మసాగర్ నుంచి అనంతసాగర్ రూ.1.28కోట్లు

మొత్తం రూ.13.97 కోట్లు

### ఎంపీ పసునూరి విడుదల చేసిన వరంగల్ లోక్‌సభ ప్రగతి నివేదిక

**రూర్బన్ పథకం ద్వారా పర్వతగిరి మండలానికి మంజూరైన మొత్తం రూ.30 కోట్లు**

- ఆరు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల కోసం రూ.2.64 కోట్లు
- ఘన వ్యర్థాల నిర్వహణ కోసం రూ.10లక్షలు
- వ్యవసాయ ప్రాసెసింగ్ (49) రూ.11.18కోట్లు
- టూరిజం డెవలప్‌మెంట్(5) రూ.5.81కోట్లు
- హెల్త్ సబ్‌సెంటర్(9) రూ.1.79కోట్లు
- స్కూల్‌లో వసతులు(33) రూ.2.78కోట్లు
- కన్వెన్షన్ సెంటర్(పర్వతగిరి) రూ.2కోట్లు
- అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణం(4) రూ.68లక్షలు
- మినీ స్టేడియం రూ.25లక్షలు
- ఓపెన్ జిమ్‌లు(6) రూ.33లక్షలు
- ఈ-పంచాయతీలు (18) రూ.18 లక్షలు

**నేషనల్ హైవేలు**

- 363 జాతీయ రహదారి వెడల్పు రూ.104.23 కోట్లు
- మహదేవపూర్ నుంచి భూపాలపల్లి రెండు లైన్ల రోడ్డు నాలుగు లైన్లుగా చేసేందుకు రూ.163.89కోట్లు
- నేషనల్ హైవే 163 సుగమం చేసేందుకు రూ.194.59కోట్లు
- సైడు కాలువలు, స్లాబుల నిర్మాణం రూ.1.85కోట్లు
- నయీంనగర్ నాలా నిర్మాణం రూ.5.06కోట్లు
- 353 సిరొంచ ఆత్మకూరు రోడ్ భద్రతా పనులు రూ.54.85కోట్లు
- 163 ఫోర్‌లేన్ రోడ్లుగా వెడల్పు చేసేందుకు రూ.208.72కోట్లు
- సీఎంఆర్‌ఎఫ్ రూ.128కోట్లు

**స్మార్ట్‌సిటీ**

- 69 ప్రాజెక్టులు రూ.948 కోట్లతో పనులు ఎంపిక అందులో పూర్తయినవి..
- భద్రకాళి చెరువు, కట్ట రిపేరు
- 13 జంక్షన్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ రిపేరు
- ఎంజీఎం హాస్పిటల్‌లో మురుగునీటిశుద్ధి కేంద్రం
- సెంట్రల్, రీజినల్ లైబ్రరీలో ఫర్నిచర్ ఏర్పాటు
- ఫాతిమా నుంచి సుబేదారి వరకు రోడ్డుకు ఇరువైపులా 2 కిలోమీటర్లు సైకిల్ ట్రాక్
- రోడ్డు ఊడ్చే యంత్రాలు రెండు కొనుగోలు
- 500 సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు
- సెంట్రల్, రీజినల్ లైబ్రరీ ఆధునీకరణ
- పద్మాక్షిగుడి, పబ్లిక్‌గార్డెన్ ఆధునీకరణ

**భూపాలపల్లి నియోజకవర్గం**

- ఎన్‌హెచ్ నుంచి ప్రగతిసింగారం వయా శాయంపేట పత్తిపాక రూ.6.40కోట్లు
- రేపాక నుంచి పరకాల రూ.5.22కోట్లు
- చెన్నాపూర్ నుంచి రాజక్కపల్లి రూ.5.49కోట్లు

మొత్తం రూ.17.11కోట్లు

### హృదయ్

- భద్రకాళి చెరువు ముందుతీరం అభివృద్ధి రూ.21.27కోట్లు
- పద్మాక్షి టెంపుల్ అభివృద్ధి రూ.2.03కోట్లు
- వేయిస్తంభాలగుడి అభివృద్ధి రూ.0.94కోట్లు
- కాజీపేట దర్గా అభివృద్ధి రూ.1.78కోట్లు
- ఫోర్ట్ వరంగల్ లైటింగ్ రూ.8.97కోట్లు

మొత్తం రూ.35కోట్లు

### అమృత్

అమృత్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం మంజూరైన మొత్తం రూ.239.40కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.95.62కోట్లు, మున్సిపాలిటీ ద్వారా రూ.156.03కోట్లు మొత్తం రూ.491కోట్లు ఫీడర్ పైపులైన్లు 162 కిలోమీటర్లు డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ 1,757 కిలోమీటర్ల ట్యాంకులు 33 ఇంటి కనెక్షన్లు 1,20,353.

### సీఎస్ఆర్

గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా ద్వారా మహాత్మా ఘండి మెమోరియల్ ఆస్పత్రికి రూ.3కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా గిరిజన పాఠశాలలకు వాటర్ హీటర్లు లైటింగ్, మౌలిక వసతుల కోసం మంజూరు చేయించిన మొత్తం రూ.9.50కోట్లు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పసునూరి దయాకర్

# రూ.3వేల కోట్లతో వరంగల్ అభివృద్ధి

## కేంద్రాన్ని ఒప్పించి నిధులు తీసుకువచ్చా

- విభజన చట్టం హామీలను నెరవేర్చాలి
- అనేక సంక్షేమ పథకాలు కేసీఆర్ ఘనతే
- నిత్యం ప్రజల మధ్యే ఉన్నా
- అధిష్టానం నిర్ణయం మేరకే పనిచేస్తా
- వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్
- లోక్‌సభ సెగ్మెంట్ అభివృద్ధి నివేదిక విడుదల

హనుమకొండ, చౌరస్తా, జనవరి 24: స్మార్ట్ సిటీ, హృదయ్, అమృత్, రూర్బన్ పథకాల ద్వారా రూ.3,268కోట్ల నిధులు తీసుకువచ్చి వరంగల్ పార్లమెంట్‌ను అభివృద్ధి చేసినట్లు ఎంపీ పసునూరి దయాకర్ తెలిపారు. బుధవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీగా కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, మెప్పించి తెలంగాణ రాష్ట్రంలోనే అత్యధిక నిధులు తీసుకువచ్చానని, బండి సంజయ్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంపీగా ఉన్నప్పుడు ఇన్ని నిధులు తీసుకురాలేదని చెప్పారు. విభజన హామీల్లో పొందుపరిచిన హామీలను వెంటనే అమలు చేయాలని, బయ్యారం ఉక్కు, కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్ డివిజన్ గురించి అనేకసార్లు కేంద్రానికి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. రామప్ప, ఖిలావరంగల్‌ను యునెస్కోలో చేర్చాలని ఎంపీలందరం కలిసి విన్నవించగా రామప్పకు యునెస్కో గుర్తింపు లభించిందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, వ్యవసాయానికి 24గంటల కరెంట్, సాగునీరు ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆశీర్వాదం తనకు ఎల్లప్పుడూ ఉంటుందని, మొదటిసారి ఓట్లు వేసి దేశంలోనే 7వ స్థానం, రెండోసారి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిపారని గుర్తుచేశారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, తాను ప్రజల మధ్యే ఉన్నానని అన్నారు. కార్యకర్త స్థాయి నుంచి ఎంపీగా ప్రజలు ఆశీర్వదించారని, పనిచేసినవాళ్లను కేసీఆర్ గుర్తిస్తారన్నారు. తాను మళ్లీ పోటీ చేస్తానని, తమ ఎమ్మెల్యేలు లేని లోటు ఎంపీగా గెలిచి చూపిస్తానన్నారు. రూ.3వేల కోట్ల నిధుల పనులు చేసినప్పటికీ ఏ ఒక్క కాంట్రాక్టర్ వద్ద కమీషన్లు తీసుకోలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు రాజ్‌కుమార్, రాజేందర్, పసునూరి రజినీకాంత్ పాల్గొన్నారు.

### ప్రగతిలో ఉన్నవి..

- ఆట స్థలాల ఏర్పాటు.. ఓ సిటీ, హనుమకొండ, కీర్తినగర్, జక్కలొద్ది
- రాంపూర్ డంప్‌యార్డు వద్ద 3లక్షల టన్నుల సేంద్రియ ఎరువుల యూనిట్
- 22 కిలోమీటర్ల మేర స్మార్ట్‌రోడ్ల ఏర్పాటు
- 37 ప్రభుత్వ స్కూళ్లలో మౌలిక వసతుల ఏర్పాటు
- ప్రెసిడెన్సీ స్కూల్, నయీంనగర్ మోరీ వద్ద అడ్డుగోడ నిర్మాణం
- ఉర్సుగుట్ట, ప్రగతినగర్‌లో ఘనవ్యర్థాల నిర్వహణ యూనిట్లు
- ములుగు, నర్సంపేట, కరీంనగర్, ఖమ్మం రోడ్ల నుంచి వరంగల్ నగరానికి ప్రవేశద్వారాలు

### స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం

- ఘనపూర్ నుంచి ఐనవోలు వరకు రోడ్డు వెడల్పు రూ.16కోట్లు
- నాగారం నుంచి కుందారం వయా నవాబుపేట రూ.4.55కోట్లు
- ఘన్‌పూర్ నుంచి ఐనవోలు వయా కూనూరు గార్నెపల్లి వరకు రోడ్డు వెడల్పు రూ.20కోట్లు
- పిట్టలగూడెం నుంచి కిందారం వయా బాంజిపేట రూ.4.01కోట్లు
- ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి పిట్టలగూడెం రూ.2.23కోట్లు

మొత్తం రూ.10.79కోట్లు

### రైల్వే..


- పిరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్ మంజూరు రూ.338కోట్ల నుంచి రూ.650 కోట్లకు పెంపు
- కాజీపేట వద్ద పిట్‌లైన్ల నిర్మాణానికి రూ.18కోట్లు
- కాజీపేట రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.25కోట్లు
- వరంగల్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.4కోట్లు
- నష్కల్ అండర్‌పాస్, వంగపల్లి ఆర్‌వోబీ
- కాజీపేట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి
- బీట్‌బజార్ వద్ద ఆర్వోబీ
- వరంగల్ అండర్ బ్రిడ్జి వద్ద రెండో బ్రిడ్జి
- ఘన్‌పూర్ వద్ద ఆర్‌యూబీ, ఆర్వోబీ
- ఫాతిమానగర్ వద్ద బ్రిడ్జి, వందేభారత్ ట్రైన్



### పాలకుర్తి నియోజకవర్గం

- నెల్లుట్ల నుంచి నాంచారిమడూరు వరకు రోడ్డువెడల్పు రూ.10కోట్లు
- నెల్లుట్ల నుంచి నాంచారిమడూరు వరకు రోడ్డు వెడల్పు బిట్-2 రూ.20కోట్లు
- ఉప్పరగూడెం నుంచి పెద్దవంగర వరకు రోడ్డు వెడల్పు రూ.12కోట్లు
- బమ్మెర నుంచి జఫర్‌గఢ్ వయా తమ్మడపల్లి వరకు రోడ్డు వెడల్పు రూ.12కోట్లు
- కొత్తూరు నుంచి ల్యాబర్తి క్రాస్ రూ.4.81కోట్లు
- రాయపర్తి నుంచి మహబూబ్‌నగర్ వయా పెరికేడ్ రూ.2.62కోట్లు
- ఆర్ అండ్ బీ రోడ్ వర్ధన్నపేట తోబురాన్‌పల్లి రూ.10.11కోట్లు
- పీడబ్ల్యూడీ అమ్మాపురం రోడ్ వద్ద బ్రిడ్జి రూ.2.99కోట్లు
- పీడబ్ల్యూడీ తొర్రూరు నుంచి కొడకండ్ల వయా గంట్లకుంట, రంగాపూర్ రూ.4.04కోట్లు
- అవుతాపూర్ నుంచి కొడకండ్ల వయా గంట్లకుంట, రంగాపూర్ రూ.4.04కోట్లు
- కొత్తూరు నుంచి రోళ్లకల్ క్రాస్ రూ.6.11కోట్లు
- దేవరుప్పుల నుంచి విస్నూరు వయా కొత్త గుడిసెలు రూ.9.72కోట్లు
- సింగరాజుపల్లి నుంచి జీడికల్ వయా నీర్మాల రామరాజుపల్లి రూ.11.49కోట్లు
- గూడూరు నుంచి ధర్మపురం వయా ఎర్రవెను, శాంతాపూర్ రూ.14.97కోట్లు
- పాలకుర్తి నుంచి కొడకండ్ల వయా వల్మిడి ముత్తారం రూ.13.09కోట్లు
- ఎర్రవెను నుంచి కంచనాపల్లి రూ.10.43కోట్లు
- పాకాల నుంచి ఆర్ అండ్ బీ రోడ్ చెన్నూరు రూ.7.56కోట్లు
- పాలకొండ తండా నుంచి ధర్మారం రూ.8.93కోట్లు

మొత్తం రూ.111.63 కోట్లు



అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీ | గుడి గంట కొడుతున్న చిన్నారి

## మేడారానికి పోటెత్తుతున్న భక్తులు

- తల్లులకు ముందస్తు మొక్కులు
- దర్శించుకున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

తాడ్వాయి, డిసెంబర్ 24 : మహా జాతర సమీపిస్తున్న కొద్దీ ముందస్తు మొక్కులకు మేడారానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. బుధవారం సమ్మక్క-సారలమ్మను దర్శనానికి వేల సంఖ్యలో ప్రజలు వచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచే కాకకుండా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల నుంచి సైతం తల్లుల సన్నిధికి చేరుకున్నారు. మొదట జంపన్న వాగులో పుణ్యస్నానాలు చేసి వాగు ఒడ్డున ఉన్న జంపన్న గద్దె, నాగులమ్మ గద్దె వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గద్దెల ప్రాంగణానికి చేరుకొని సమ్మక్క-సారలమ్మ, గోవిందరాజు, పగిడ్డిరాజుకు పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం సమర్పించి మొక్కులు చెల్లించారు. గద్దెల పరిసరాలతో పాటు చిలకలగుట్ట, జంపన్నవాగు, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో విడిది చేశారు. అలాగే రాష్ట్ర ఎన్నిక కమిషనర్ పార్థసారథి కుటుంబ సమేతంగా అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి అదనపు కలెక్టర్ శ్రీజ, మేడారం ఈవో రాజేంద్రం, పూజారులు ఘన స్వాగతం పలికి గద్దెల వద్దకు తీసుకెళ్లగా గిరిజన సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించారు. పూజారులు అమ్మవార్ల వస్త్రాలతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. వారి వెంట తహసీల్దార్ తోట రవీందర్ ఉన్నారు.

## గిరిజన యూనివర్సిటీలో త్వరలో తరగతులు

- జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్‌లో ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం
- రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

ములుగురూరల్, జనవరి 24 : జిల్లా కేంద్రంలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు కానున్న నేపథ్యంలో త్వరలో తరగతులను ప్రారంభించనున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ శరత్ అన్నారు. బుధవారం గట్టమ్మ దేవాలయం ఎదుట ఉన్న భూములను డిప్యూటీ రిజిస్ట్రార్(ఎస్టేట్) అభిషేక్, కేంద్రీయ విద్యాలయం రిజిస్ట్రార్ దేవిప్ష్ నిగమ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్ వారికి మ్యాప్ ద్వారా భూముల వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శరత్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఏర్పాటుకు 337 ఎకరాల స్థలం సేకరించినట్లు చెప్పారు. దీనిని రెవెన్యూ అధికారులు గిరిజన సంక్షేమ శాఖకు బదలాయింపు చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ములుగు మండలంలోని జాకారం యూత్ ట్రైనింగ్ సెంటర్ తాత్కాలికంగా తరగతులను ప్రారంభించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. వారి వెంట జాయింట్ డైరెక్టర్ కల్యాణ్‌రెడ్డి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఏఈ నవీన్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, సర్వేయర్ సత్యనారాయణ ఉన్నారు.



గిరిజన యూనివర్సిటీ మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

## రైల్వే దవాఖానను ఉన్నతీకరిస్తాం

- విమానాశ్రయం తరహాలో కాజీపేట రైల్వే జంక్షన్
- త్వరలో రైల్వే డివిజన్‌గా ఏర్పాటు
- దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్
- రైల్వే దవాఖానలో అదనపు గదులు ప్రారంభం



రైల్వే పాలిక్లినిక్ దవాఖానలో నిర్మించిన అదనపు గదులను ప్రారంభిస్తున్న దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

కాజీపేట, జనవరి 24: కాజీపేట రైల్వే పాలిక్లినిక్ దవాఖానను భవిష్యత్‌లో మరింత ఉన్నతీకరిస్తామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. సికింద్రాబాద్ నుంచి ప్రత్యేక రైలులో ఆయనతోపాటు దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ ఉన్నతాధికారులకు స్థానిక అధికారులు బుధవారం ఘనస్వాగతం పలికారు. రైల్వే ప్లాట్‌ఫారం, జంక్షన్ సర్క్యులేటింగ్ ఏరియాలో కొనసాగుతున్న అమృత్ అభివృద్ధి పనులు, రన్నింగ్ రూం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైల్వే జంక్షన్ పరిధిలోని ఫిట్‌లైన్, క్రూ లాబీలను తనిఖీ చేశారు. అంతకుముందు రైల్వే పాలిక్లినిక్ దవాఖాన ఆవరణలో సుమారు రూ.2.5కోట్ల వ్యయంతో నిర్మించిన అదనపు గదులను ప్రారంభించారు. రైల్వే వైద్యులతో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైల్వే కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమన్నారు. రూ. 20కోట్ల అమృత్ నిధులతో అధునాతన సౌకర్యాలు, హంగులతో కాజీపేట రైల్వే జంక్షన్‌ను విమానాశ్రయం తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్ పరిధి వివిధ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న రైల్వే అధికారులు, సిబ్బంది పనితీరు బాగుందని నగదు ప్రోత్సాహక బహుమతులను ప్రకటించారు. కాజీపేట రైల్వే జంక్షన్ త్వరలోనే డివిజన్ స్థాయి గుర్తింపు పొందుతుందని రైల్వే ఉన్నతాధికారులతో పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే డివిజన్ డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్, పీసీఎండీ డాక్టర్ సీకే వెంకటేశ్వర్లు, రైల్వే సీఎంఎస్ డాక్టర్ అనురాధ రెడ్డి, సీనియర్ డీఎస్‌టీఈ ప్రతి అగర్వాల్, డీఎన్ ప్రంజల్ పాల్గొన్నారు.

### రైల్వే మజ్దూర్ యూనియన్ అసంతృప్తి

కాజీపేట రైల్వే జంక్షన్ పరిధిలోని రైల్వే పాలిక్లినిక్ దవాఖానను రైల్వే సబ్ డివిజన్ దవాఖానగా ఉన్నతీకరించకుండా అదనపు గదులతో పాలిక్లినిక్‌ను అప్‌గ్రేడ్ చేసి ప్రారంభించడంపై రైల్వే దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాలువ శ్రీనివాస్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కాజీపేట రైల్వే దవాఖాన పరిధిలో దాదాపు 7,500 మంది రైల్వే కార్మికులు, కార్మిక కుటుంబాలు, రిటైర్డ్ కార్మికులు, కుటుంబాలు వైద్య సేవలు పొందుతారని తెలిపారు. గతంలోనే రైల్వే బోర్డుకు కాజీపేట పాలిక్లినిక్ దవాఖానను సబ్‌డివిజన్ దవాఖానగా అభివృద్ధి చేయాలని కోరినట్లు తెలిపారు. అందుకు రైల్వేబోర్డు సబ్ డివిజన్‌గా ఉన్నతీకరించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని, అధికారికంగా ఆదేశాలు రాకపోవడంతో రైల్వే ఉన్నతాధికారులు కావాలనే పాలిక్లినిక్ దవాఖానను అప్‌గ్రేడ్ చేసి అదనపు గదులు నిర్మించి ప్రారంభించడం సరికాదన్నారు. రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకులు నాయిని సదానందం, ఎస్కే జానీమియా, సమ్మయ్య, దేవులపల్లి రాఘవేందర్, గరిమిట్ల రాజేశ్వర్‌రావు, రాజయ్య, ప్రశాంత్, రఘు, రైల్వే రిటైర్డ్ నాయకుడు ఎస్ఆర్‌వీ రావు ఉన్నారు.

### కోటను సందర్శించిన రైల్వే జీఎం, డీఆర్‌ఎం

ఖిలావరంగల్: ఓరుగల్లు కోటను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, సికింద్రాబాద్ డివిజనల్ మేనేజర్ భరతేష్ జైన్ బుధవారం సందర్శించారు. స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కీర్తి తోరణాల ప్రాంగణంలోని శిల్పసంపదతోపాటు ఖుష్‌మహల్ తదితర చారిత్రక కట్టడాలను వీక్షించారు.

## రామప్పలోకి దేవాదుల నీరు

- నిత్యం 30 అడుగులు ఉండేలా పంపింగ్
- రామప్ప నుంచి పాకాల, రంగాయ చెరువు, గణప సముద్రంలకు నీటి తరలింపు

వెంకటాపూర్, జనవరి 24 : రామప్ప చెరువులోకి దేవాదుల పంపుహౌస్ నుంచి ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. యాసంగి పంట కోసం భీంఘన్‌పూర్ పంప్‌హౌస్ నుంచి ఒక మోటరు ద్వారా రామప్ప చెరువులోకి 2 టీఎంసీల నీటిని విడుదల చేస్తూ రామప్ప నుంచి పాకాల, రంగాయచెరువు, గణప సముద్రం చెరువులకు నీటిని పంపిస్తున్నట్లు డీఈ రవీందర్ తెలిపారు. రామప్ప చెరువులో 30 అడుగుల నీటి సామర్థ్యం ఉండేలా సుమారు 60 రోజుల పాటు నీటిని పంపింగ్ చేయనున్నట్లు చెప్పారు.



రామప్ప చెరువులోకి వస్తున్న దేవాదుల నీరు

## ప్రాణం తీసిన ఓవర్‌టేక్

- రాంగ్‌రూట్‌లో వెళ్లి ఆటోను ఢీకొట్టిన బుల్లెట్ బైక్
- ఘటనా స్థలంలోనే ఒకరి మృతి.. దవాఖానకు తరలిస్తుండగా మరొకరు..
- యువకుడికి తీవ్రగాయాలు



శివశంకర్, రజిత (ఫైల్)

హసన్‌పర్తి, జనవరి 24: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందిన ఘటన మండలకేంద్రంలో జరిగింది. సీఐ తుమ్మ గోపి కథనం ప్రకారం.. హసన్‌పర్తికి చెందిన కోటం శివశంకర్(30), హనుమకొండ రాంనగర్‌కు చెందిన చిట్యాల సంపత్ బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు బుల్లెట్ బైక్‌పై హనుమకొండ నుంచి హసన్‌పర్తికి వస్తున్నారు. ఈ క్రమంలో హసన్‌పర్తి నల్లగుట్ట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా.. ఎదురుగా వస్తున్న ఆటోను రాంగ్ రూట్‌లో వెళ్లి వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో బైక్ వెనకాల కూర్చున్న శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న గుండ్ల సింగారానికి చెందిన భూక్యా రజిత(40)కు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను ఎంజీఎం దవఖానకు తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో మృతి చెందింది. బైక్ నడుపుతున్న సంపత్‌కు రెండు కాళ్లు విరిగిపోవడంతో ఎంజీఎం దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు సీఐ తెలిపారు. రజిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.